



# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190






ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :186 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ గురువారం- 06 - ఆగస్టు - 2026


## మోదీ వీడియో తొలగింపు అంశం క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్!



- ప్రధాని మోదీ పోస్టు తొలగింపు వివాదం తర్వాత మెటా గ్లోబల్ అధికారులతో కేంద్రం కీలక సమావేశం
- చిన్నారుల దుర్వినియోగ కంటెంట్, డీప్‌ఫేక్‌లు, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో లోపాలపై క్షమాపణ చెప్పినట్లు ప్రభుత్వ వర్గాల వెల్లడి

ఢిల్లీ : దేశంలో ఇటీవల చోటుచేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తొలగింపు వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, మెటా సంస్థ మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి.

## తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలి.



- కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసిన సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్.
- రూ.42 వేల కోట్ల పనులు నిలిచిపోయాయని వినతి

ఢిల్లీ, ఆగస్టు 5: రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం పార్లమెంట్ భవనంలో కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి గారు, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

### సుప్రీం తీర్పు అనుకూలంగా వచ్చింది

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఇటీవల మిగతా..2లో

### ఆర్టికల్ 370 రద్దు తర్వాత- జమ్మూకశ్మీర్, లద్ధాఖ్

## ప్రజల జీవితాల్లో చాలా మార్పులు వచ్చాయి


### ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు

ఆర్టికల్ 370 రద్దు తర్వాత- జమ్మూకశ్మీర్ విద్య, వైద్యం, వ్యాపార, క్రీడా రంగాలు మెరుగయ్యాయ్



ఢిల్లీ : 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత నుంచి జమ్మూకశ్మీర్ , లద్ధాఖ్ ప్రజల జీవితాల్లో విస్తృతమైన మార్పులు వచ్చాయని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం అన్నారు. ఇరు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణతోపాటు విద్య, వైద్యం, వ్యాపార, క్రీడా రంగాల్లో అవకాశాలు ఎంతో మెరుగయ్యాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జమ్మూకశ్మీర్ , లద్ధాఖ్ ప్రాంతాల అభివృద్ధికి, అక్కడ ఉన్న ప్రతి పౌరుడికి పెద్ద కలలు కనే, వాటిని సాధించే, వికసిత్ భారత్ నిర్మాణంతో తమ వంతు సహకారం అందించే అవకాశం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారంటూ ఎక్స్ లో ఓ పోస్టు పెట్టారు. “ఏడేళ్ల క్రితం ఇదే రోజున, ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఏ) చరిత్రగా మారిపోయాయి. ఇది జమ్మూకశ్మీర్ , లద్ధాఖ్ ప్రస్థానంలో ఒక నిర్ణయాత్మకమైన కొత్త అధ్యాయాన్ని లిఖించింది. మిగతా..2లో

## బడికి వెళ్లాలంటే ప్రాణాలు పణంగా పెట్టాలా!




- చదువుకోవాలనే ఆకాంక్ష ఉంటే సరిపోదు..
- పిల్లలు రోజూ బడికి వెళ్లడానికి చేస్తున్న భయంకరమైన ప్రయాణం ఇప్పుడు దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది.
- గడిచిన ఐదేళ్లుగా విద్యార్థులు రోజూ ఇలాగే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు

# ఏసీబీ కోర్టు గ్రీన్ సిగ్నల్

- ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్
- రూ.1 లక్ష పూచీకత్తుతో పాటు పలు షరతులు విధించిన ఏసీబీ కోర్టు
- యూకే, అమెరికా, జర్మనీ, చైనా పర్యటనకు గ్రీన్ సిగ్నల్
- సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్ట్ తిరిగి ఇవ్వాలని ఆదేశం



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేసింది. సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, అధికారిక పర్యటన నిమిత్తం తన పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇవ్వాలని, విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం, పలు షరతులతో ఆయన విదేశీ పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆగస్టు 3న జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించవచ్చు. అయితే, ఈ పర్యటనకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. రూ.1 లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఒకరి హామీని సమర్పించాలని ఆదేశించింది. పర్యటన ప్రణాళిక, ఆయా దేశాల్లో బస చేసే వివరాలను కోర్టుకు అందించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు కేంద్ర విదేశాంగ శాఖ నుంచి రాజకీయపరమైన అనుమతి పొందాలని, పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక 2026 సెప్టెంబర్ 18 లోగా తన పాస్‌పోర్ట్‌ను తిరిగి కోర్టులో జమ చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. 2015లో నమోదైన ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి మొదటి నిందితుడిగా (ఏ1) ఉన్నారు. అప్పట్లో ఆయన టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డికి అనుకూలంగా ఓటు వేయాలని నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై 2015 మే 31న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో దాదాపు నెల రోజుల పాటు జైలులో ఉన్న రేవంత్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ షరతుల్లో భాగంగా ఆయన తన పాస్‌పోర్ట్‌ను కోర్టుకు అప్పగించారు. విదేశాలకు వెళ్లాల్సి వస్తే ఏసీబీ కోర్టు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అప్పట్లో హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో రేవంత్ రెడ్డి, ఇతరులపై ఏసీబీ అధికారులు మిగతా..2లో

### సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో

## రేవంత్ కుమ్మక్కయ్యారా?



- సమ్మక్క సాగర్ నీళ్లను ఏపీకి ధారాదత్తం చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధపడిందన్న హరీశ్
- దీనిపై రేవంత్ నోరు విప్పాలని డిమాండ్
- తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపాటు

హైదరాబాద్: కర్ణాటకలో జరిగిన ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ అనంతరం సమ్మక్క-సారక్క (సమ్మక్క సాగర్) ప్రాజెక్టుకు చెందిన తెలంగాణ వాటా నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధపడిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... తెలంగాణ ప్రజలకు సంబంధించిన అత్యంత కీలకమైన నీటి హక్కులపై కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా..2లో

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి



- హింసను అదుపు చేసే క్రమంలో బలగాలు జాగ్రత్తగా ఉండాలన్న సుప్రీంకోర్టు
- యువత ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరిక
- యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని వ్యాఖ్య

ఢిల్లీ : కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఆందోళనలు, వాటి సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల పట్ల అధికారులు మిగతా..2లో

## తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్.. డయల్ 112తో అన్ని సేవలు




- ఒకే నంబర్‌తో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు
- హైదరాబాద్‌లో కొత్త కాల్ సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ
- కాలర్ లొకేషన్‌ను గుర్తించి వెంటనే ఆయా సేవలకు సమాచారం
- సమీప బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకునేలా చర్యలు
- ఏడాది పొడవునా 24 గంటలు 112 సేవలు అందుబాటులో
- అత్యవసర సేవల్లో ఏఐ వినియోగాన్ని పెంచనున్నట్లు డీజీపీ వెల్లడి

హైదరాబాద్: తెలంగాణలో అత్యవసర సేవల కోసం ఇకపై ఒకే నంబర్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వాటన్నింటికీ డయల్ 112 అమల్లోకి వచ్చింది. మిగతా..2లో

## కూటమి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తీవ్ర ఆరోపణలు



- దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్
- పొగాకుకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన
- రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు: కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు
- వైసీపీ హయాంలో ఉన్న సున్నావడ్డీ, రైతు భరోసా పథకాలు రద్దు చేశారని విమర్శ
- ప్రభుత్వం సిండికేట్లతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తోందని జగన్ ధ్వజం

అమరావతి: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని

### ప్రపంచ డిజిటల్ ఎకానమీలో ఏపీ యువత

# భాగస్వామ్యం కావాలి..

- ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.
- ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం..
- నూతన కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.



విశాఖపట్నం, ఆగస్టు 5: ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటును అందిస్తోందన్నారు. సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఏపీ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో మిగతా..2లో

### విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై

## సీఎం చంద్రబాబు సమీక్ష



- ★ రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం
- ★ ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు
- ★ మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి
- ★ ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

## మొదటి పేజి తరువాయి

### ప్రపంచ డిజిటల్ ఎకానమీలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలి..

భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

### ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా..

ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ ఫస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

## కూటమి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తీవ్ర ఆరోపణలు

కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది. కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

## సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు గ్రీన్ సిగ్నల్

అవినీతి నిరోధక చట్టం, నేరపూరిత కుట్ర (ఐపీసీ 120బీ) కింద ఛార్జిషీట్ దాఖలు చేశారు. తనపై ఉన్న ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ దశలో ఉంది.

## తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్.. డయల్ 112తో అన్ని సేవలు

హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సహా ఇతర అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత విస్తృతంగా వినియోగించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

## తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలి.

సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈ అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కోర్టు తీర్పు తర్వాత ఇక ఎలాంటి అవరోధాలు లేవని, కాబట్టి ఈ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

### ఇప్పటికే వేల కోట్లు ఖర్చు

ఈ సందర్భంగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చు వివరాలను సీఎం వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు డిండి ఎత్తిపోతల పథకంపై రూ.3,187 కోట్లు సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై రూ.1,835 కోట్లు గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మొత్తం కలిపి రూ.42,809 కోట్లు వెచ్చించినా అనుమతులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు.

### ఆలస్యం వల్ల వ్యయం పెరుగుతోంది

అనుమతులు ఆలస్యం కావడం వల్ల ప్రాజెక్టుల వ్యయం రోజురోజుకు పెరుగుతోందని, దీనివల్ల రైతులకు సాగునీరు అందడంలో జాప్యం జరుగుతోందని కేంద్ర మంత్రికి వివరించారు. తెలంగాణలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర వ్యవసాయ రంగం బలోపేతం అవుతుందని సీఎం అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రాజెక్టులకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని మరోసారి కోరారు.

### ప్రతినిధుల బృందం హాజరు.

ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య తో పాటు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బడికి వెళ్లాలంటే ప్రాణాలు పణంగా పెట్టాలా!

హైదరాబాద్: చదువుకోవాలనే ఆకాంక్ష ఉంటే సరిపోదు.. దానికి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సిందే అన్నట్లుగా మారింది మధ్యప్రదేశ్‌లోని విద్యార్థుల పరిస్థితి. విదిశా జిల్లాకు చెందిన పాఠశాల పిల్లలు రోజూ బడికి వెళ్లడానికి చేస్తున్న భయంకరమైన ప్రయాణం ఇప్పుడు దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. విదిశా జిల్లాలోని బెట్వా నదిపై ఉన్న డ్యామ్ పిల్లర్ల మీద ఒక్కో అడుగు వేసుకుంటూ చిన్నారులు ప్రమాదకరంగా నదిని దాటుతున్నారు. 10 కిలోమీటర్ల భారం: సాధారణ రహదారి ద్వారా వెళ్లాలంటే దాదాపు 10 కిలోమీటర్లు అదనంగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.అంత దూరం వెళ్లలేక, సమయానికి బడికి చేరుకోవడానికి విద్యార్థులు సురక్షితమైన మార్గం లేక డ్యామ్ కాంక్రీట్ పిల్లర్ల మీద నడుస్తున్నారు.ఏమాత్రం బ్యాలెన్స్ తప్పి కాలు జారినా నేరుగా హోరెత్తే బెట్వా నది ప్రవాహంలో పడి ప్రాణాలు పోవడం ఖాయం. ఏదో ఒక్కరోజు ఎదురైన తాత్కాలిక సమస్య కాదు ఇది. గడిచిన ఐదేళ్లుగా విద్యార్థులు రోజూ ఇలాగే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. స్థానికంగా ఉన్న చిన్నారులు డ్యామ్ పిల్లర్లపై బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమవ్వడంతో వీడియో విపరీతంగా వైరల్ అయ్యింది. ఈ దృశ్యాలను చూసిన నెటిజన్లు, స్థానిక ప్రజలు ప్రభుత్వం మరియు విద్యాశాఖ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారా?" అంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఎట్టకేలకు స్థానిక అధికారులు నిద్రలేచారు. ఈ ఘటనపై స్పందించిన అధికారులు..

## నిరసనల్లో పాల్గొనే యువత పట్ల అత్యంత సహనంతో వ్యవహరించాలి

అత్యంత విచక్షణతో, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. హింసను అదుపు చేసే నెపంతో భద్రతా బలగాలు కూడా అంతే తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగితే పరిస్థితులు మరింత దారి తప్పే ప్రమాదముందని హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లలో సీజేపీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయని, జులై 20 నాటి నిరసనల్లో రాళ్లదాడి, హింస కారణంగా సార్వజనిక ఆస్తులకు జరిగిన నష్టానికి ఆ సంస్థనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కొత్త అర్జీని కూడా ఢిల్లీ తదితర ప్రాంతాల్లోని విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ప్రధాన కేసులతో సుప్రీంకోర్టు జతచేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత ప్రదర్శనల సమయంలో పోలీసులు అత్యంత సంయమనం పాటించాలని సూచించిన సీజేఐ... యువత హింసాత్మక మార్గాల వైపు వెళ్లకుండా చూడటమే అధికారుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. యువకులు అసలు ఏం కోరుకుంటున్నారు, వారి ఆవేదనకు కారణమేంటో ఓపికగా వినడమే

## సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా?

### మొదటి పేజి తరువాయి

మౌనం వహించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంల సమావేశం, తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం తర్వాత సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి మన రాష్ట్రానికి చెందిన 47 టీఎంసీల వాటాను ఏపీ కోసం వదులుకోవడానికి సిద్ధపడ్డారనే వార్తలు నెట్టింట వ్యాపిస్తున్నాయని... దీనిపై సీఎం రేవంత్ రెడ్డి నోరు విప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు అజెండాలో సమ్మక్క సాగర్‌కు 47 టీఎంసీలు కేటాయించే ప్రసక్తే లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసినా, ఈ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం స్పందించకపోవడం అనుమానాలకు



తావిస్తోందని మండిపడ్డారు. తమ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సమ్మక్క సాగర్ 47 టీఎంసీల ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల కేంద్ర అనుమతులు తీసుకొచ్చామని హరీశ్ రావు గుర్తుచేశారు. ఆఖరికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గానికి కూడా ఫలాలను అందించే ఈ నీటి కేటాయింపులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వదులుకుంటుందని ప్రశ్నించారు. చంద్రబాబు మళ్లీ తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కునేందుకు కుట్రలు పన్నుతున్నారని, తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకునేలా కేంద్రానికి లేఖలు రాయడమే కాకుండా బోర్డు సమావేశాల్లో పాత అనుమతులను రద్దు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణకు నీటి విషయంలో అన్యాయం జరిగితే సహించేది లేదని, జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబును ఈ సందర్భంగా హెచ్చరించారు.

## విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు

### మొదటి పేజి తరువాయి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమీక్షా సమావేశంలో వీఈఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం కాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. 'బేసిటీ' ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా చేసుకుని విశాఖ రీజియన్ అభివృద్ధిని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. వీఈఆర్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ స్థాయి ప్రణాళికతో సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళిక మూలపేట పోర్టు నుంచి రాజమండ్రిలోని అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు విస్తరించి ఉండాలని ఆయన సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (ఎ+ఫీ) స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆర్టికల్ 370 రద్దు తర్వాత- జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ ప్రజల జీవితాల్లో చాలా మార్పులు వచ్చాయి

### మొదటి పేజి తరువాయి



అప్పటి నుంచి జమ్మూకశ్మీర్ , లద్ధాఖ్ ప్రజల జీవితాల్లో విస్తృతమైన మార్పులు వచ్చాయి. మౌలిక సదుపాయాలు విస్తరించాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపార, క్రీడలు వంటి రంగాల్లో అవకాశాలు పెరిగాయి. భారత రాజ్యాంగం అక్కడ పూర్తిగా అమలు కాకపోవడం వల్ల, దశాబ్దాలుగా ప్రాథమిక రాజ్యాంగ హక్కులకు నోచుకోని మహిళలు, వెనుకబడిన వర్గాల ప్రజలు ఇప్పుడు సాధికారత సాధించారు."

**- ప్రధాని మోదీ, ఎక్స్**

పోస్టు కశ్మీర్ కు ప్రత్యేక హోదా రద్దు 2019 ఆగస్టు 5వ తేదీన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్ కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. ఆ తర్వాత ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ నేపథ్యంలోనే మోదీ తన ఎక్స్ పోస్టులో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈ సంవత్సరం ఆగస్టు 5వ తేదీకి మరింత ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే ఈ సంవత్సరమే మన దేశం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని జరుపుకుంటోంది. జాతీయ ఐక్యత పట్ల ఆయన జీవితకాల నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. దశాబ్దాల క్రితం ఆయన ఊహించినది 2019 ఆగస్టు 5న నెరవేరింది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి పూర్వరూపమైన 'భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడే శ్యామా ప్రసాద్ ముఖర్జీ. ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూకశ్మీర్ ను పూర్తిగా భారతదేశంలో విలీనం చేయాలని ఆయన పోరాడారు. 1906 జులై 6న జన్మించిన ఆయన, 1953 జూన్ 23న శ్రీనగర్ లో గృహ నిర్బంధంలో ఉన్న సమయంలో కన్నుమూశారు. కశ్మీర్ పురోగమిస్తోంది! మరోవైపు జమ్మూకశ్మీర్ ప్రాంతం ప్రస్తుతం పురోగమనంలో ఉందని కేంద్రం చెబుతోంది. శ్రీనగర్ వారసత్వానికి (హెరిటేజ్ ) అంతర్జాతీయ గుర్తింపు లభించడం, రికార్డు స్థాయిలో అక్కడకు పర్యటకులు వస్తుండడం, హస్తకళల వృద్ధి ఇందుకు నిదర్శనమని పేర్కొంది. కశ్మీర్ సంస్కృతి, సంప్రదాయాలను, అక్కడి ప్రకృతి అందాలను చూడడానికి ప్రపంచ నలుమూలల నుంచి సందర్శకులు వస్తున్నారని చెబుతోంది. "శ్రీనగర్ యునెస్కో క్రియేటివ్ టీ, వరల్డ్ క్రాఫ్ట్ సిటీ అనే ప్రతిష్ఠాత్మక టైటిల్స్ ను దక్కించుకుంది. ఇది కశ్మీర్ కాలాతీత హస్తకళా నైపుణ్యాన్ని వేడుకగా జరుపుకుంటూ, దాని కళాత్మక వారసత్వాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్తోంది" అంటూ పీఐబీ ఇండియా తన ఎక్స్ లో ఓ పోస్టు పెట్టింది. 2026లో యాభై లక్షల మందికి పైగా భక్తులు వైష్ణోదేవిని సందర్శించారని, 4 లక్షల మందికిపైగా యాత్రికులు అమరనాథ్ యాత్రను పూర్తి చేశారని పేర్కొంది. ఇది ప్రజల్లోని విశ్వాసానికి ప్రతీక అని, ఈ విధంగా జమ్మూకశ్మీర్ లో ఆధ్యాత్మిక పర్యాటకం విలసిల్లుతోందని స్పష్టం చేసింది.

## మోదీ వీడియో తొలగింపు అంశం- క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్!

### మొదటి పేజి తరువాయి

మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ చిన్నారుల లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్ (సీఎస్ఏఎం), డీప్‌ఫేక్‌లు, అలాగే ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై క్షమాపణలు తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఆ సమావేశంలో మెటా బృందానికి భారత చట్టాల ప్రకారం సోషల్ మీడియా సంస్థల బాధ్యతలను స్పష్టంగా వివరించారు. కంటెంట్‌ను ఎవరికీ చూపించాలనే విషయంలో మెటా స్వయంగా నిర్ణయాలు తీసుకుంటున్నందున, తమను పూర్తిగా ఇంటర్మీడియరీగా పరిగణించలేమని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సమాచార సాంకేతిక చట్టంలోని 'సేఫ్ హార్బర్' రక్షణ వర్తించదని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

### అలాంటి చర్యలపై విచారం

సమావేశంలో మెటా ప్రతినిధులు కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు భారీగా నిధులు ఖర్చు చేసిన విషయాన్ని అంగీకరించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాంటి చర్యలపై విచారం వ్యక్తం చేస్తూ, జరిగిన పొరపాట్లకు క్షమాపణలు చెప్పినట్లు సమాచారం. మెటా గ్లోబల్ అఫైర్స్ అధికారి జోయెల్ కాప్లన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం వారు ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి చేసిన వీడియో సందేశం ఫేస్‌బుక్‌లో కొంతసేపు అందుబాటులో లేకపోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



పేపర్ లీకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని పేర్కొన్న ఆ పోస్టును మెటా తొలుత తొలగించి, అనంతరం తిరిగి పునరుద్ధరించింది. దీనిని సాంకేతిక లోపంగా మెటా వివరణ ఇచ్చినా, ఆ వివరణ సంతృప్తికరంగా లేదని కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఐటీ మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది.

### కేంద్ర ప్రభుత్వం ప్రశ్నలు

ఇన్‌స్టాగ్రామ్‌లో చెల్లింపు ప్రకటనల రూపంలో చిన్నారుల లైంగిక దుర్వినియోగ కంటెంట్ వ్యాప్తి చెందిన అంశంపైనా ప్రభుత్వం ఇటీవల మెటాకు నోటీసులు జారీ చేసింది. ఆ అంశంపై తీసుకున్న చర్యలేమిటి, డీప్‌ఫేక్‌లు వంటి కృత్రిమ మేధ ఆధారిత తప్పుడు సమాచారాన్ని అరికట్టేందుకు ఎలాంటి వ్యవస్థలు అమల్లో ఉన్నాయనే విషయాలను సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించినట్లు సమాచారం. ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, ప్రపంచంలో అగ్రగామి సాంకేతిక సంస్థగా ఉన్న మెటా ఇలాంటి సమస్యలను సమర్థంగా ఎదుర్కొనే సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలని అన్నారు. అయినప్పటికీ కొన్ని అంశాల్లో ఎందుకు వైఫల్యాలు చోటుచేసుకున్నాయో తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. భారత చట్టాలకు అనుగుణంగా సోషల్ మీడియా సంస్థలు ఎలా వ్యవహరించాలి, చట్టపరమైన నిబంధనలను ఎలా అమలు చేస్తాయి అనే విషయంలో స్పష్టమైన అవగాహన ఉండాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యంగా ప్రముఖ ప్రజాప్రతినిధులు, ధ్రువీకరించిన ఖాతాల నుంచి వచ్చే పోస్టులను తొలగించే ముందు అదనపు భద్రతా చర్యలు ఉండాల్సిన అవసరాన్ని ప్రభుత్వం నొక్కిచెప్పింది. ప్రభుత్వ వర్గాల ప్రకారం, ఇది కేవలం సాంకేతిక సమస్య మాత్రమే కాకుండా జాతీయ భద్రత, ప్రజా శాంతి భద్రతలకు సంబంధించిన అంశంగా కూడా పరిగణిస్తున్నారు. మెటా అల్గారిథమ్ ఎలా పనిచేస్తుంది, కంటెంట్ ప్రాధాన్యతను ఏ ప్రమాణాల ఆధారంగా నిర్ణయిస్తుంది, అల్గారిథమిక్ పక్షపాతం ఉందా లేదా అనే అంశాలపై కూడా కేంద్రం వివరణ కోరింది. ఈ వివాదం అనంతరం ప్రధాని మోదీతో పాటు ఇతర ప్రముఖుల సోషల్ మీడియా పోస్టులపై అదనపు పర్యవేక్షణ చేపడుతున్నట్లు మెటా కేంద్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా తెలిపింది. సీనియర్ అధికారుల పలు స్థాయిల పరిశీలన తర్వాతే అలాంటి పోస్టులపై చర్యలు తీసుకునేలా కొత్త భద్రతా వ్యవస్థను అమలు చేసినట్లు సంస్థ వివరించింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ ప్రసంగానికి సంబంధించిన ఫేస్‌బుక్ పోస్టు తొలగింపు ఘటనపై పార్లమెంటు ప్యానెల్ కూడా తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. మూడు రోజుల్లోగా క్షమాపణ చెప్పకపోతే ఆయనకు ప్రస్తుతం ఉన్న చట్టపరమైన రక్షణను ఉపసంహరించే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు సమాచారం. అయితే ఆ అంశంపై ఇప్పటివరకు మెటా నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## మళ్లీ రగిలిన కావేరి చిచ్చు తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లో నీటి యుద్ధానికి కారణాలు ఏంటి?

**కర్ణాటక, తమిళనాడు మధ్య కొనసాగుతున్న నీటి యుద్ధం- బ్రిటీష్ వారి కాలంలోనే మొదలైన కావేరీ నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం లేదా?**


ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన అంశం ఉదయ్‌నిధి స్టాలిన్, నటి త్రిషపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఆయన అరెస్ట్. అయితే ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు అంశం 'కావేరి జలాల వివాదం'. అసలు ఏంటి ఈ నీటి పంచాయితీ? దశాబ్దాలుగా కర్ణాటక, తమిళనాడు మధ్య కొనసాగుతున్న ఈ నీటి యుద్ధం ఎందుకు ఏటా మళ్లీ మళ్లీ రగులుకుంటోంది? ఈ వివాదం ఎక్కడ మొదలైంది? కోర్టులు, ట్రిబ్యునళ్లు ఎన్నో తీర్పులు ఇచ్చినా ఎందుకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు? రైతులకు జీవనాధారమైన 'కావేరి' రాజకీయాల్లో మాత్రం ఎందుకు శాశ్వత సంక్షోభంగా మారింది?

దక్షిణ గంగ- శాశ్వత వివాదం

దక్షిణ భారతదేశంలో అత్యంత పవిత్రమైన నదిగా, దక్షిణ గంగగా పూజలు అందుకుంటోంది కావేరి నది. ఇది కర్ణాటక, తమిళనాడు మధ్య దశాబ్దాలుగా రాజకీయ, సామాజిక, భావోద్వేగ ఘర్షణకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది. అయితే కావేరి నీటి పంపకాల వివాదం కేవలం కర్ణాటక, తమిళనాడు మధ్య మాత్రమే కాదు, కేరళ, పుదుచ్చేరి కూడా ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం, బలహీన రుతు పవనాలు వంటి కారణాలతో జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిన ప్రతిసారీ, కావేరి వివాదం మళ్లీ భగ్గుమంటుంది. ట్రైబ్యునల్ పంపకాలు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నా, కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ పని చేస్తున్నా, సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదు. దీని పూర్వాపరాలు తెలుసుకోవాలంటే, గత వందేళ్ల చరిత్రను తెలుసుకోవాల్సిందే!

బ్రిటీష్ కాలంలోనే మొదలైన వివాదం

బ్రిటీష్ పాలనా కాలంలోనే కావేరి వివాదం మూలాలు ఉన్నాయి.



1892లో, తరువాత 1924లో అప్పటి మైసూర్ సంస్థానం, మద్రాస్ ప్రెసిడెన్సీ మధ్య రెండు కీలక ఒప్పందాలు జరిగాయి. దాని ప్రకారం దిగువన ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీ సాగునీటి అవసరాలకు ప్రాధాన్యం లభించిందని, ఎగువన ఉన్న మైసూర్ అభివృద్ధికి పరిమితులు విధించారని కర్ణాటక వాదిస్తోంది. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ తర్వాత ఈ వివాదం కొత్త రూపం దాల్చింది. 1974లో 1924 ఒప్పందం గడువు ముగిసిన తర్వాత, కర్ణాటక "నది మా రాష్ట్రంలో పుడుతోంది. ముందుగా మా అవసరాలు తీర్చుకోవడం సహజ హక్కు" అని వాదించడం మొదలుపెట్టింది. ఇదే సమయంలో "శతాబ్దకాలంగా కావేరిపైనే ఆధారపడిన డెల్టా వ్యవసాయం నీరు లేక నాశనం అవుతుంది" అంటూ తమిళనాడు అంటోంది.

ట్రైబ్యునల్, కోర్టులు ఏమన్నాయి?

కావేరీ నదీజలాల వివాదాన్ని పరిష్కరించడం కోసం 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరి జల వివాద ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. దాదాపు 17 ఏళ్ల విచారణ అనంతరం 2007లో ట్రిబ్యునల్ తుది అవార్డు ప్రకటించింది. అయితే దీనిపై ఇరు రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కేసు సుప్రీంకోర్టుకు చేరింది. 2018లో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. అంతర్రాష్ట్ర నదులు ఏ ఒక్క రాష్ట్రానికీ చెందినవి కావని, అవి జాతీయ వనరులని స్పష్టం చేసింది. అదే సమయంలో బెంగళూరు నగర తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని కర్ణాటకకు 284.75 టీఎంసీ, తమిళనాడుకు 404.25 టీఎంసీ, కేరళకు 30 టీఎంసీ, పుదుచ్చేరికి 7 టీఎంసీ నీటికి కేటాయించింది. ప్రతి నీటి సంవత్సరంలో బిల్లిగుండ్లు వద్ద 177.25 టీఎంసీ నీటిని తమిళనాడుకు విడుదల చేయాలని ఆదేశించింది. ఈ తీర్పు అమలు కోసం కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, కావేరి రెగ్యులేషన్ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కర్ణాటక విడుదల చేసే నీటిని కొలిచేది ఈ బిల్లిగుండ్లు సీడబ్ల్యూసి గేజింగ్ స్టేషన్ వద్దనే.

అయినా మళ్లీ మళ్లీ వివాదాలు ఎందుకు?

సాధారణ సంవత్సరాల్లో నీటి పంపిణీపై మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, తీవ్ర కరవు పరిస్థితుల్లో నీటిని ఏ ప్రమాణాలతో పంచుకోవాలనే విషయంలో ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రావడం లేదు. తమిళనాడులో జూన్-జూలైలోనే కురువై వరి సాగుకు నీరు అత్యవసరం. అదే సమయంలో కర్ణాటకలో వర్షాలు ఆలస్యమైతే, డ్యాముల్లో నిల్వలు తగ్గిపోతాయి. అలానే తమిళనాడులో కేవలం జూన్-జూలైలో వేసే కురువై సీజన్‌తో పాటు ఆగస్టు - సెప్టెంబరులో ప్రారంభమయ్యే సంబా సీజన్‌కూ కావేరి నీరు అత్యంత కీలకం. ఇలాంటి పరిస్థితుల్లో ముందు తాగునీరు, తరువాత సాగునీరు అని కర్ణాటక వాదిస్తుంటే, ఒప్పందాల ప్రకారం నీటిని తప్పనిసరిగా విడుదల చేయాలని తమిళనాడు వాదిస్తూ వస్తున్నాయి.

మేకేదాడు రిజర్వాయర్ తో కొత్త వివాదం

వీటికి తోడు బెంగళూరు భవిష్యత్ తాగునీటి అవసరాల కోసం ప్రతిపాదించిన మేకేదాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు కూడా కొత్త వివాదానికి దారితీసింది. తమిళనాడులోని తిరుచిరాపల్లి, తంజావూరు, దిండిగల్, ఈరోడ్ వంటి నగరాల తాగునీటి పథకాలు కూడా కావేరిపైనే ఆధారపడ్డాయి.

రాజకీయాలు- భావోద్వేగాలు- ఓటు బ్యాంకు

కావేరి వివాదం కేవలం నీటి సమస్య మాత్రమే కాదు. ఇది రెండు రాష్ట్రాల్లోనూ అత్యంత శక్తిమంతమైన రాజకీయ అంశం. కర్ణాటకలో పాత మైసూరు ప్రాంత రైతులు ముఖ్యంగా మండ్య, మైసూరు,

## 3040 ఏళ్లుగా సేవలు... అయినా ఉద్యోగ భద్రత లేదు!

### ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్ కార్మికుల ఆవేదన "లిమా చెమటతో హాస్టళ్లు నడిచాయి... ఇప్పుడు మా బతుకులకు దిక్కెవరు?"

కొమురం భీం జిల్లా:: గిరిజన విద్యార్థులకు మూడు పూటలా అన్నం పెట్టే చేతులే నేడు తమ కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని వేడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొమురం భీం జిల్లా ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో 30 నుంచి 40 సంవత్సరాలుగా డైలీ వేజ్ కార్మికులుగా పనిచేస్తున్న వంట కార్మికులు, సహాయక సిబ్బంది తమ గోడును వెలిబుచ్చుతున్నారు. దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఇప్పటివరకు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా తమ జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని వాపోతున్నారు. ఒకప్పుడు కట్టెల పొయ్యిలపై పొగ మధ్య గంటల తరబడి వంటలు చేసి వేలాది మంది గిరిజన విద్యార్థులకు భోజనం వడ్డించామని, ఆ పొగ కారణంగా పలువురికి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వచ్చాయని, కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారని కార్మికులు చెబుతున్నారు. అయితే విధి నిర్వహణలో మరణించిన డైలీ వేజ్ కార్మికుల కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వకుండా ఔట్‌సోర్సింగ్ ద్వారా నియామకాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వయసు పైబడటంతో చాలామంది డైలీ వేజ్ కార్మికులు విధులు నిర్వహించలేని పరిస్థితికి చేరుకున్నారని, వారి కుటుంబాలు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయడంతో పాటు, మరణించిన లేదా వయోభారంతో పని చేయలేని డైలీ వేజ్ కార్మికుల కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డైలీ వేజ్ కార్మికులకు ఎంప్లాయీ ఐడీలు రూపొందించి, జీతాలను నేరుగా చెల్లించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, ఎన్నో ఏళ్లుగా సేవలందించిన వయోవృద్ధ డైలీ వేజ్ కార్మికుల భవిష్యత్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ప్రస్తుతం పని చేయలేని స్థితికి చేరుకున్న వారికి, లేదా వారి కుటుంబ సభ్యుల్లో కనీసం ఒక్కరికైనా ఉద్యోగం కల్పించి జీవన భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "మా చేతుల మీదుగా వేలాది మంది గిరిజన విద్యార్థులు చదువుకొని ఈరోజు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కానీ మేము మాత్రం ఇప్పటికీ డైలీ వేజ్ కార్మికులుగానే మిగిలిపోయాం. మా సేవలను గుర్తించి ఈ ప్రభుత్వమైనా మాకు న్యాయం చేయాలి. మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయడంతో పాటు, వయసు పైబడిన లేదా మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి జీవనానికి భరోసా ఇవ్వాలి" అని డైలీ వేజ్ కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. మూడు నుంచి నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ సేవలో ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రత లేక, రేపటి జీవితం ఎలా ఉంటుందోనన్న ఆందోళనతో జీవిస్తున్న ఈ డైలీ వేజ్ కార్మికుల గోడును ప్రభుత్వం వింటుందా? లేక మరోసారి హామీలకే పరిమితం చేస్తుందా? అన్న ప్రశ్న ఇప్పుడు అందరిలోనూ వ్యక్తమవుతోంది.

## జైనూర్ మండలంలో ఉపాధ్యాయుని ఘనంగా పదవీ విరమణ వేడుకలో గౌరవ ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు శ్రీమతి కోవ లక్ష్మి గారు పాల్గొని సత్కరించారు



కొమురం భీం : ఆసిఫాబాద్ జిల్లా, జైనూర్ మండలం లో విధులు నిర్వహిస్తున్న శ్రీ మెస్రం మనోహర్ గారు ఈరోజు ఉద్యోగ విరమణ పొందారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అసిఫాబాద్ శాసన సభ్యురాలు శ్రీమతి కోవ లక్ష్మి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 సంవత్సరాలకు పైగా ఉపాధ్యాయునిగా ఎంతో మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన మెస్రం మనోహర్ గారి సేవలు చిరస్మరణీయం. వారి అంకితభావం, క్రమశిక్షణ యువ ఉపాధ్యాయులకు ఆదర్శం అని కొనియాడారు. మనోహర్ గారికి శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. వారి భవిష్యత్ జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మనసారా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల ప్రజాప్రతినిధులు, బి ఆర్ ఎస్ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మందమర్రి బోనాల జాతరలో మాజీ విప్ నల్లాల ఓదెలు పాల్గొన్నారు



మందమర్రి,,: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని రాజనాలవాడ, మేకల మార్కెట్‌లో నిర్వహించిన ఆషాడమాసం బోనాల జాతరలో మాజీ ప్రభుత్వ విప్, మాజీ చెన్నూరు ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నల్లాల ఓదెలును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల జాతర



మందమర్రి, : మందమర్రి పట్టణంలో రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢ బోనాల జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. 1979 నుంచి నిరంతరాయంగా 165 రజక కుటుంబాలు నిర్వహిస్తున్న ఈ జాతర ఈ ఏడాది మరింత వైభవంగా జరిగింది.మార్కెట్ ప్రాంతంలోని గంగరాజుల రామ్‌చందర్ నివాసం నుంచి మహిళలు బోనాలు ఎత్తుకుని మార్కెట్ ప్రధాన వీధుల గుండా స్టేషన్ రోడ్డులోని పోచమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 3వ జోన్‌లోని నల్ల పోచమ్మ ఆలయాన్ని దర్శించుకుని, కేకే-5 ఫిల్టర్ బెడ్ సమీపంలో నూతనంగా నిర్మించిన కులదైవం మడేలేశ్వర స్వామి ఆలయానికి వందలాది బోనాలతో ఊరేగింపుగా చేరుకుని బోనాలు సమర్పించారు.అనంతరం మడేలయ్య స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బాజా భజంత్రీలు, డీజే పాటలు, నృత్య ప్రదర్శనలతో జాతర ఉత్సాహభరితంగా సాగి భక్తులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గంగరాజుల రామ్‌చందర్ మాట్లాడుతూ, బోనాల జాతర రజక సమాజ సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. కులదైవం మడేలేశ్వర స్వామి ఆశీస్సులతో రజక కుటుంబాలన్నీ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. 1979లో ప్రారంభమైన ఈ సంప్రదాయ జాతరలో, 2026లో కేకే-5 ఫిల్టర్ బెడ్ సమీపంలో నిర్మించిన మడేలయ్య దేవాలయంలో తొలిసారిగా బోనాలు సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. ఇతర కుల సంఘాల సహకారంతో రానున్న సంవత్సరాల్లో జాతరను మరింత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగేపు హనుమంతు, ప్రధాన కార్యదర్శి రాగుల రాములు, క్యాషియర్ మామిడి రమేష్, చల్లా బద్రి, గుడికందుల సమ్మయ్య, పెనుగొండ సమ్మయ్య, కళావతి, తిరుపతి, పైతర్ శ్రీను, గుడి ఓదెలు, గొడ్డుపెల్లి సారయ్య, బుక్కెర అంజి, కొత్తకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాల సేవ... మిగిలింది ఆవేదన!

### గిరిజన బిడ్డలకు అన్నం పెట్టిన చేతులకు ఆకలి కేకలు...

### కొమురం భీం జిల్లా ఐటీడీఏ డైలీ వేజ్ కార్మికుల కన్నీటి కథనం


కొమురం భీం,: గిరిజన వికాసానికి, గిరిజన పిల్లల చదువులకు పునాదులుగా నిలిచే ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో వేలాది మంది విద్యార్థులకు నిత్యం మూడు పూటలా కడుపు నింపే ఆ చేతులు నేడు ఆకలితో, భవిష్యత్తు భయంతో వణుకుతున్నాయి. దశాబ్దాలుగా నమ్ముకున్న కొలువుల్లో గుర్తింపు లేక, చేతిలో పైసా భద్రత లేక కొమురం భీం జిల్లా ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్ వంట కార్మికులు, సహాయక సిబ్బంది దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. 30 నుంచి 40 ఏళ్లుగా నిరంతరాయంగా సేవలు అందిస్తున్నా తమ బతుకులకు ఇప్పటికీ దిక్కులేకుండా పోయిందని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు.

### పొగచూరిన జీవితాలు... తీరని కష్టాలు

ఒకప్పుడు ఆధునిక వసతులు లేని రోజుల్లో,కట్టెల పొయ్యిల పొగ మధ్య గంటల తరబడి శ్రమించి వేలాది మంది గిరిజన విద్యార్థులకు వీరు భోజనం వడ్డించారు. దశాబ్దాల పాటు పొగలోనే పనిచేయడంతో పలువురు కార్మికులు ఊపిరితిత్తుల వ్యాధులు,ఇతర తీవ్ర ఆరోగ్య సమస్యల బారిన పడ్డారు. సరైన వైద్యం అందుబాటులో లేక, ఆర్థిక స్థోమత లేక కొందరు విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా తమకు ఇచ్చే చాలీచాలని వేతనాల్లో ఎలాంటి మార్పు రాలేదని, కుటుంబాలను గడపడం కష్టంగా మారిందని వారు వాపోతున్నారు.

### వారసత్వ ఉద్యోగాల ఊసేది? ఔట్‌సోర్సింగ్ కుట్రపై మండిపాటు

విధి నిర్వహణలో మరణించిన లేదా వయోభారంతో పనిచేయలేని స్థితికి చేరుకున్న డైలీ వేజ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని కార్మికులు ఆరోపిస్తున్నారు. "చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు వారసత్వంగా ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి, గుట్టుచప్పుడు కాకుండా ఔట్‌సోర్సింగ్ ద్వారా కొత్త నియామకాలు చేపడుతున్నారు. దశాబ్దాలుగా హాస్టళ్లను నమ్ముకున్న మా కుటుంబాలను రోడ్డున పడేయడం ఏంటి?" అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయానికి స్వాగతం..కానీ గుర్తింపు ఏది? రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డైలీ వేజ్ కార్మికులకు ఎంప్లాయీ ఐడీలు కేటాయించి, వేతనాలను నేరుగా చెల్లించే విధానాన్ని తీసుకురావడాన్ని కార్మికులు స్వాగతిస్తున్నారు. అయితే, కేవలం జీతాల చెల్లింపుతో సరిపెట్టకుండా తమ దశాబ్దాల సేవలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్లు: దశాబ్దాలుగా పనిచేస్తున్న డైలీ వేజ్ కార్మికులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. వయోభారంతో విధులకు దూరమైన వారికి, మరణించిన కార్మికుల కుటుంబాల్లోని కనీసం ఒకరికి ఉద్యోగ భద్రత కల్పించాలి. పనిచేయలేని స్థితిలో ఉన్న వయోవృద్ధ కార్మికులకు ప్రత్యేక పింఛన్ లేదా ఆర్థిక సహాయం అందించాలి. "మా చేతుల మీదుగా పెరిగిన వారు అధికారులయ్యారు. మేం మాత్రం ఇక్కడే ఉన్నాం!,మా చేతుల మీదుగా అన్నం తిని, చదువుకున్న వేలాది మంది గిరిజన విద్యార్థులు ఈరోజు సమాజంలో ఉన్నత ఉద్యోగాల్లో, మంచి హోదాల్లో స్థిరపడ్డారు. అది చూసి మేం గర్వపడుతున్నాం. కానీ వారి కడుపు నింపిన మేం మాత్రం ఇప్పటికీ 'డైలీ వేజ్' కార్మికులుగానే మిగిలిపోయాం. వయసు మళ్లిన ఈ దశలో మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోకపోతే మా కుటుంబాలు వీధిన పడతాయి."




### ముగింపు:

ప్రభుత్వం స్పందిస్తుందా? మూడు నుంచి నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను తమ భుజస్కంధాలపై మోసిన ఈ శ్రామికుల గోడును ప్రభుత్వం ఆలకిస్తుందా? దశాబ్దాల వారి శ్రమకు తగిన న్యాయం చేస్తూ ఉద్యోగ భద్రత కల్పిస్తుందా? లేక గత ప్రభుత్వాల తరహాలోనే హామీలకే పరిమితం చేస్తుందా? అన్నది ఇప్పుడు ఐటీడీఏ పరిధిలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ కార్మిక కుటుంబాలకు జీవన భరోసా ఇవ్వాలని సర్వత్రా విజ్ఞప్తులు వ్యక్తమవుతున్నాయి.

# టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశం

మంచిర్యాల, : టీఎన్జీవో భవన్ మంచిర్యాలలో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి అధ్యక్షతన సాధారణ సమావేశం ను ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశం లో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ జిల్లా లోని నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఉద్యోగులు అందరూ సభ్యత్వం ను సెప్టెంబర్ 30 లోపు తీసుకుని రాష్ట్రం లోనే ముందు 100 శాతం పూర్తి చేసి ఆదర్శంగా ఉండాలని మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల లోపు ఆరువేల కోట్లు విడుదల చేసినందుకు గాను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి మరియు రాష్ట్ర మంత్రివర్గానికి మరియు టిఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ కి ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని (ముజీబ్) కి కృతజ్ఞతలు తెలియజేస్తూ అలాగే ఇంకా పెండింగ్ లో ఉన్న 6 డి ఏ లను వెంటనే విడుదల చేయాలని పి ఆర్ సి నీ వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ ను తొలగించి ఓ పి ఎస్ ను అమలుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంప్లాయిస్ హెల్త్ కార్డు ను అందరి కుటుంబ సభ్యులకు వర్తించే విధంగా అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని, మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్ లో అప్గ్రేడ్ అయినందున కార్పొరేషన్ పరిధిలో పనిచేసే వారందరికీ 17 శాతం హెచ్ఆర్ఏ ఇవ్వాలని ఇంకా మిగిలిన ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని టిఎన్జీవో జిల్లా సాధారణ సమావేశంలో ఏకవాక్య తీర్మానం చేసి ఇట్టి తీర్మానాన్ని రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు ఉంటాయని మరియు జిల్లా లోని ఉద్యోగుల సమస్యలపై మాట్లాడడం జరిగినది. తదుపరి జైపూర్



ఎంపిడిఓ గా ఇటీవల అదనపు బాధ్యతలు స్వీకరించిన శ్రీపతి బాపురావు ని జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలపడం జరిగినది. జిల్లా కమిటి లో ఏర్పడిన క్యాజువల్ వేకెన్సీ ఉపాధ్యక్షులు పదవిని కో ఆప్షన్ పద్ధతిలో నడిమెట్ల సత్యనారాయణ ని ఎన్నుకోవడం జరిగినది. తదుపరి జిల్లా కమిటి ఆధ్వర్యంలో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలపడం జరిగినది. ఈ సమావేశం లో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్ కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు కోశాధికారీ సతీష్ కుమార్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ కేజియా రాణి అంజయ్య తిరుపతి రామ్ కుమార్ నరేందర్ సంయుక్త కార్యదర్శి సునీత ప్రభ పద్మలత స్పోర్ట్స్ సెక్రటరీ కుమార్ మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్ కార్యదర్శి అజయ్ మందమర్రి యూనిట్ అధ్యక్షులు సుమన్



లక్షెట్టిపెట్ యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్ బెల్లంపల్లి యూనిట్ కార్యదర్శి క్రాంతి తదితరులు పాల్గొన్నారు..

## పార్కుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలి: ఎస్ సి సి డబ్ల్యూ యూ- ఐ ఎఫ్ టి యు



మందమర్రి, : మందమర్రి డివిజన్‌లోని సింగరేణి పార్కుల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్ సి సి డబ్ల్యూ యూ- ఐ ఎఫ్ టి యు ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సింగరేణి ఫారెస్ట్ ఆఫీసర్ నవీన్‌కు బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ సి సి డబ్ల్యూ యూ- ఐ ఎఫ్ టి యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం మాట్లాడుతూ, రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇంటి అద్దె, విద్యుత్ బిల్లు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, కిరాణా, ప్రయాణ వ్యయాలు, మొబైల్ రీచార్జ్ వంటి నిత్యావసర ఖర్చులు భరించలేని పరిస్థితి నెలకొందన్నారు.అంతేకాక, పలువురు కార్మికులు వెలుగు సంఘాల్లో నెలవారీ చెల్లింపులు చేయాల్సి ఉండగా, వేతనాలు అందక సమయానికి డబ్బులు చెల్లించలేక జరిమానాలు ఎదుర్కొంటున్నారని, దీంతో అనవసర వివాదాలు కూడా తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.2022లో కార్మిక సంఘాల పోరాట ఫలితంగా ప్రతి నెల 7వ తేదీలోపు కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సింగరేణి హెడ్ ఆఫీస్ నుంచి సర్క్యులర్ జారీ చేసినప్పటికీ, మందమర్రి జీఎం కార్యాలయ పరిధిలో అది అమలు కావడం లేదని ఆరోపించారు. ఇకనైనా ప్రతి నెల 7వ తేదీన వేతనాలు చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని యూనియన్ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో ఎస్ సి సి డబ్ల్యూ యూ- ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు చునర్కార్ శేఖర్‌తో పాటు కార్మికులు రాజేశ్వరి, మణెమ్మ, రమ, భారతి, స్వరూప, స్వప్న, దేవక్క, లావణ్య, చంద్రయ్య, శివ, తిరుపతి, దామోదర్, మల్లేష్, అమృత తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ నుంచి 16 మంది కార్మికులు టీబీజీకేఎస్ లో చేరిక



మందమర్రి, : మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని సివిల్ డిస్ట్రిబ్యూషన్ విభాగంలో బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ కు చెందిన 16 మంది కార్మికులు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్)లో చేరారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏరియా నాయకుడు గాలిపెల్లి తిరుపతి ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. కొత్త గనులు ప్రారంభించకపోవడం, కొత్త ఉద్యోగాల భర్తీ చేపట్టకపోవడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. బొగ్గు ఉత్పత్తి చేయకుండానే 40 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగిందని చెప్పడం ఏ విధానానికి నిదర్శనమో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నప్పటికీ కొత్త నియామకాలు చేపట్టడం లేదని, డిపెండెంట్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, బదిలీలు వంటి సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. కార్మికులకు రావాల్సిన హక్కులు, సంక్షేమ సౌకర్యాలు అమలు కావడం లేదని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు తగిన వేతనాలు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని, సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.సివిల్ డిస్ట్రిబ్యూషన్ విభాగం నుంచి గోవిందుల శ్రీనివాస్, బండి సదానందం, ఎండీ సముద్దీన్, వి. రాజయ్య, మాస్ లచ్చన్న, మోతె నరేష్, బండి వెంకటేష్, సాంబశివుడు, డి. పున్నం, బి. గణపతి, దుర్గం శంకర్, ఎం. శివరాజు, రావుల శ్రీను తదితరులు టీబీజీకేఎస్ లో చేరారు.ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఓ. రాజశేఖర్, సెంట్రల్ నాయకులు సీహెచ్ వెంకట్ రమణ, బెల్లం అశోక్, ఏరియా నాయకులు, ఫిట్ కార్యదర్శులు కొరబోయన లక్ష్మణ్, బాబురావు, వీరారెడ్డి, కొండల్‌రావు, సీపెల్లి రాజలింగు, కరుకూరి తిరుపతి, మధుసూదన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బత్తుల శ్రీనివాస్, ఎండీ అబ్బాస్, కరుకూరి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రిలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు




మందమర్రి, : రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు మందమర్రి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక మదర్ తెరెసా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింక్‌లు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ ఇవ్వవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.సైబర్ క్రైమ్ ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లేష్, కానిస్టేబుళ్లు సంతోష్, విశ్వనాథ్, సురేందర్, హోంగార్డు శ్రావణ్ కుమార్ పాల్గొని విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, డైరెక్టర్ బరిగెల సతీష్, బబ్బెర లక్ష్మణ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## గౌడ యువజన సంఘం బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతా : సామంత్ గౌడ్



సంగారెడ్డి / **(దిక్సూచి ప్రతినిధి) ఆగస్టు 05:** తెలంగాణ గౌడ యువజన సంఘం (టీజీవైఎస్) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గౌండ్ల సామంత్ గౌడ్ నియమితులయ్యారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గౌడ సమాజ అభ్యున్నతికి, యువత సమస్యల పరిష్కారానికి, సంఘ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి గౌండ్ల సామంత్ గౌడ్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది. ఈ సందర్భంగా టీజీవైఎస్ రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్ గౌడ్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో గౌడ యువజన సంఘాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు. యువతను సంఘటితం చేస్తూ గౌడ సమాజ హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో నూతన అధ్యక్షుడు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గౌండ్ల సామంత్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సమాజ అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పన, సంఘ విస్తరణ కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రతి మండలంలో సంఘాన్ని బలోపేతం చేసి, యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తానని తెలిపారు. గౌడ జాతి సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

